# హరిశ్చంద్రుడు

విశాలమైన పొలాల మీదుగా చంద్రోదయ మవుతోంది. సినిమాహాలు గేటుదగ్గిర నిలబడి గ్లాస్కో లాల్చీ మీద పడే చక్కని పసుపురంగు వెన్నెలకాంతికి వొళ్ళు జలదరించిందేమో, నాగభూషణం సినిమాకెళ్ళాలనే విషయమే మరిచిపోయి, స్త్రీలగేటువైపు చూస్తూ ఉండిపోయినాడు. సినిమాహాలు జనంతో కిక్కిరిసి పోతోంది. రికార్డుల మోత ఆగింది. వెన్నెలకాంతి తెలుపు రంగులోకి తిరుగుతోంది. తనకి పదిగజాల్లో నుంచుని ఉన్న అమ్మాయి, బుగ్గ మీదగాలికి ఊగేజుట్టు ఉంగరాలని చూడకుండా ఉండలేక పోతున్నాడు నాగభూషణం. 'చామనచాయ అయితే మాత్రమే? అందంగానే ఉంది... హాలులోకి వెళ్ళలేదెందు చేత? టిక్కెట్టు దొరకలేదు కాబోలు!' ఇల్లా అనుకుంటూ నాగభూషణం ఆమె తనవైపు అకస్మాత్తుగా చూసేటప్పటికి చిరునవ్వు నవ్వేశాడు. ఆ అమ్మాయి తల పక్కకు తిప్పుకుని వెళ్ళటానికి ముందుకు ఒకడుగు వేసింది రోడ్డువైపు.

ఇది మంచి సూచనే ఏమనుకుంటుందో అనుకున్నాడు భావనలో తన్నుతాను ధైర్యపరుచుకుంటూ నాగభూషణం. ఆమె కేసి రెండడుగులు వేస్తూ, తనవైపు చూడగానే కన్ను గీటాడు సరదాగా ఏదైతే అదౌతుందని. ఆమె ముఖంలో ఆమోదసూచకమైన సిగ్గు తెరలాగా ద్యోతకమై మాయమైంది.

ఇద్దరు అపరిచితులూ, సినిమాహాలు ఆవరణ దాటి బుర్రిపాలెం వైపు పొయ్యేరోడ్డుమీద నడవసాగారు.

''మీ వాళ్ళెవరన్నా సినిమాకొచ్చారా?'' అని కనుక్కున్నాడు తను.

''మీ కెందు కా విషయం?'' ఆమె గొంతులో తిరస్కారం లేదని నాగభూషణానికి తెలుస్తూనే ఉంది.

'సాహసేలక్ష్మీః అన్నారు పెద్దలు!' అని తనను తాను బలపర్చుకుంటూ. నాగభూషణం ఆమె అడగకుండానే పెద్ద ఉపకారికి మల్లే పోజుపెట్టి ''మీకు టిక్కెట్టు కావాలంటే ఇప్పిస్తాను. వెళ్ళి పోతున్నారేం? ఉండండి, ఇప్పటికీ మించి పోలేదు. ఆట మొదలెట్టలేదు లెండి!'' అన్నాడు.

''అక్కర్లేదులెండి!'' విసురుగా అంటూ ఆ యవ్వనవతి ఈ తద్దినం మనవెంట బడ్డదేమో అన్నట్టు ఒక నిమిషం ఆగింది. అయితే యువకత్వమూ, డిసెంబర్ నెల చలీ, మత్తు గొల్పే వెన్నెల, ఇవన్నీ కలిసి నాగభూషణాన్ని కదలనివ్వ లేదు.

''రండి, సిగ్గు పడకండి! మిమ్మల్నెక్కడో చూసిన గుర్తు. లేకపోతే అందర్నీ పలకరిస్తూ కూచుంటానా?'' సాత్వికంగా మర్యాదతో ఒకరకమైన మగతతో మాట్లాడాడు.

''మాది ఈవూరు కాదండి! మా ఆయన సినిమా దగ్గిరకి వస్తానంటే వచ్చానండి - మీరు మంచి వార్లల్లే కనబడుతున్నారు. మావారు హాస్పిటల్‌లోనే ఉండిపోయినారు కాబోలు ...'' అని ఇంకేదో చెప్పబోతూ నాగభూషణం కేసి ఒక చూపు చూసి ఆగిపోయింది.

''అయితే మీవారు ఏ హాస్పిటల్‌లో ఉన్నారేమిటి?'' అన్నాడు నాగభూషణం.

''జానకి రామయ్యగారి హాస్పిటల్‌లోనండి! దగ్గుకి మందు తింటున్నారు... అక్కడదాకా వచ్చి వదిలి పెట్టండి... మీకు పుణ్యం ఉంటుంది'' బతిమాలుతున్నట్టు అడిగిందామె.

ఇద్దరి అడుగులు సాగుతూనే ఉన్నాయి... ''అభ్యంతరమా? మా ఇల్లుకూడా అటే లెండి... అయితే ఇటు పోతున్నా వేమిటి? పడమటకి తిరగాలి'' అంటూ నాగభూషణం వెనకకు మరలాడు. ఆమెకూడా అతని వెనకే మదించిన యేనుగుకిమల్లే తలొంచుకుని నడుస్తోంది.

## 2

''మా యింట్లోకి వొచ్చిపొండి వోసారి'' అంటూ తడికల కొంపదగ్గిర ఆగాడు నాగభూషణం.

''మీ యిల్లు ఇదా?'' అంటూ ఆమె అతన్ని ఆశ్చర్యంగా చూస్తోంది. ఈ సిల్కులాల్చీ, ఉంగరం... ఈ పూరిల్లు ... ఆమెకి అనుమానంగా ఉంది.

''ఆ పక్క మేడకూడా మాదేనండి - అది అద్దెకిచ్చి యిందులో ఉంటున్నా'' అంటూ తడిక కట్లు విప్పి లోపల అడుగుపెట్టాడు.. ఆమె కూడా లోపలకొచ్చింది. ఒక చిరిచాప, రెండు పాత పత్రికలు బెడ్‌రూములైటు వెలుగులో మసక మసకగా కన్పించినై.

''ఇట్లా కూర్చోండి!'' అంటూ నాగభూషణం ఏదో చటుక్కున జ్ఞాపకం వచ్చినవాడల్లే ''వెధవ చలి...'' అని తెరిచిన తడిక బాగా దగ్గిరకేశాడు.

''నేను వెళ్తానండీ!'' అంటూ నిజంగా లేచే ఉద్దేశం ఏకోశానా కన్పించని వైఖరితో తీక్షణంగా నాగభూషణం కళ్ళల్లోకి చూస్తూ ఆమె చిరిచాపమీద కూలబడ్డది.

''వెళ్దురుగాని - మీ పేరేమన్నారు....'' తనూ ఆమెకి ఒక్క అడుగు దూరంలో కూర్చుని నాగభూషణం జేబులోంచి బీడీ తీశాడు. ''నా పేరు చంద్రమతి'' ఆమె గొంతు సన్నగా అద్భుతంగా

వినిపించింది నాగభూషణానికి. ఆ నిమిషంలో ఆమె పేరుతో ఏమీ అవసరం లేక పోయినా ఏదన్నా మాట్లాడాలని అతని ఆదుర్దా. ఆమె వంక తీవ్రమయిన దృష్టితో చూస్తూ బెడ్‌రూమ్ లైట్‌తో బీడీ వెలిగించే ప్రయత్నంలో దీపం కాస్తా ఆర్పి ''అరెరే!'' అన్నాడు.

''ఎట్లా ఇప్పుడు?'' అన్నదామె ఆ విషయమై ఏమీ విచారపడని గొంతుపెట్టి.

''పరవాలేదు, వెన్నెల చారలున్నాయిగా'' అన్నాడు నాగభూషణం తడికల సందుల్లోంచి చిరిచాపమీద పడుతున్న వెన్నెల చారల్ని చూపుతూ.

చంద్రమతి ఒక్కసారి వొళ్ళు విరుచుకుని ''అబ్బ వొళ్ళంతా నొప్పిగావుంది'' అంటూ చిరిచాపమీద వెల్లి కలా పడుకుంది, ఎడం చెయ్యి తలకింద పెట్టుకుని. రెండు మూడు వెన్నెల చారలు ఆమె కళ్ళమీదా ఎర్రటి పెదాలమీదా పడి మెరుస్తున్నాయి. ఆమె వయస్సు యెంతో నిర్ణయించడం నాగభూషణం వశంకాలేదు. ఆ సమయంలో ఏ విషయం మీదయినా ఒక ఖచ్చితమయిన నిర్ణయానికి రావటం అతనికి చేతకాదేమో కూడాను.

''చంద్రా!'' అంటూ అతను ఆమె వక్షంమీదికి వొరిగాడు. అతనిలో కవిత్వం పొర్లింది. కాని మాటలు మాత్రం గొంతులోనే ఉండిపోయినై.

★ ★ ★

'' ఒకటీ, రెండు'' అని దూరంగా తాలూకాలో కొడుతున్న గంటల్ని లెక్క పెట్టింది చంద్రమతి.

''అబ్బ, పడకుందూ! వెధ్ధవుగాని'' అంటూ నాగభూషణం ఆమెని తిరిగి ఆక్రమించుకున్నాడు.

'' ఉస్! ఎవరన్నా వింటారయ్యా, మెల్లిగా...'' అన్నది చంద్రమతి వెచ్చటి పెదాలతో అతని నోరు మూస్తూ. ఆమె కుడి చెయ్యి మెల్లిగా నాగభూషణం జేబులు తడవ నారంభించింది. ఈ దెబ్బతో నాగభూషణం చప్పున స్మృతిలోకి వచ్చి ''మెల్లిగా, బీడీలు విరిగిపోగలవు'' అన్నాడు మెల్లిగా - కాని, గాఢంగా నవ్వి.

''అబద్ధం!'' ఆమె తన ప్రయత్నం మానకుండా ఐదు నిమిషాలు వెతికి. విసుగెత్తింది కాబోలు ''ఛీ ! దూరంగా ఫో!'' అని అతని బలమైన పట్టునుంచి విడివడి దూరంగా జరిగి పడుకుంది.

''నీకేం కావాలి! జేబులు తడువుతున్నావు?''

''నీకు తెలీదు, నాకేం కావాలో?''

'' ఎట్లా తెలుస్తుంది?''

'' ఇంతదూరం తీసుకొచ్చిన వాడివి...''

''ఓ! డబ్బులా? భలే... హ... హహ్హ....'' నాగభూషణానికి చచ్చేట్టు నవ్వొచ్చింది.

''ఎందుకట్లా నవ్వుతావు?'' ఆమె తీవ్రమైన గొంతు పెట్టి అడిగేటప్పటికి నాగభూషణం నవ్వాపేశాడు. ''డబ్బులా? వాటికోసం ఆరురోజులనుంచీ అడగరాని వాళ్ళనల్లా అడిగాను. తిరగరాని చోటల్లా తిరిగాను, దొరక లేదు. నువ్వు తేలికగా జేబులో చెయ్యి పెట్టి డబ్బులంటే నవ్వురాక ఏం వస్తుంది? ఇంకా నయం! ఏడవనందుకు సంతోషించు'' అతని హృదయాంతరాళంనుంచి ఉద్రేకం పొంగి ఈ మాటలు వచ్చినై. ఇంకా సాగేదే కాని ఆమె చప్పునలేచి నిల్చుని బైటకి పోతూ, ఏడ్పు, నిస్పృహ కలిసిన స్వరంతో ఇలా అన్నది. ''నీ సిల్కు లాల్చీ, మెరిసే ఉంగరం, తెల్లనిపంచా చూసి నీవెంట వస్తేరెండు మూడు రోజుల తిండికి భయం లేదనుకున్నాను. కాని నువ్వు నాకన్న దరిద్రుడివన్న సంగతి తెలిసేప్పటికి నాకూ నవ్వొస్తున్నది. అయితే ఆ మేడ నీదన్నావు!''

''అంటాను. తెనాలే నాదంటే మాత్రం నష్టమేమిటి? అందులో నీబోటి దానిముందు...'' నాగభూషణం చటుక్కున ఏదో జ్ఞాపకమొచ్చి ''అయితే నువ్వు మామూలు సంసార స్త్రీ అని నేను అనుకున్నది భ్రమ అంటావా ఏమిటి?'' అని అడిగాడు ఆశ్చర్యంగా.

''నువ్వు జమీందారువో, ల్యాండులార్డువో అని నే ననుకున్నది ఎంత నిజమో, నువ్వు నన్ను సంసార స్త్రీ అనుకున్నదీ అంతే నిజం!''

''సరిపోయింది, ఇద్దరం దొరికినందుకు చెప్పాలి'' అంటూ నాగభూషణం నీరసంగా తడిక వాకిలి బిగించి ఆమె వెనకాలే రోడ్డుమీదికి వచ్చి నిలబడ్డాడు. ఆమె పోతూ పోతూ ''నీ పేరేమిటి?'' అని అడిగింది.

''హరిశ్చంద్రుడు.''

అతని స్వరంలో ఎగతాళిని గ్రహించుకున్నదల్లే ఉంది ఆమె. ''మళ్ళీ అబద్ధమా? నీ బతుకు చెడా!'' అన్నది శాపం పెడుతున్నట్టు.

''అబద్ధమా! పొరపాటు - నీ పేరు చంద్రమతి ఐనంత వరకు నా పేరు హరిశ్చంద్రుడై ఉండటం న్యాయం అని చెప్పాను'' నాగభూషణం చిలిపినవ్వు నవ్వుతూ మారీసు పేట కేసినడిచాడు. ఆమె చీకట్లో ఎటు పోయిందో పోయింది.

*('రక్తస్పర్శ' కథల సంపుటి, 1963)*